## కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

### -మాల సంఘాల జెఏసి వైస్ చైర్మన్ తుమ్మ శ్రీనివాస్

**గజ్వేల్, జూలై 22 (ప్రభాతవార్త):**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన తెలంగాణ ప్రభుత్వ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరుతూ ఉద్యమకారుల సమావేశంలో కమిటీ సభ్యులు, ఎమ్మెల్సీ కోదండరాంకు తెలంగాణ మాల సంఘాల జేఏసి వైస్ చైర్మన్ తుమ్మ శ్రీనివాస్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు, రైతులు, కార్మికులు, కవులు, కళాకారులు, మహిళలతో పాటు కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు క్రియాశీలకంగా పాల్గొన్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం వస్తే తమ జీవితాలు మారుతాయని అనుకున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంకిరెడ్డిపల్లి సర్పంచ్ శశికాంత్, యువజన కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు మన్నె కృపానందం తదితరులు పాల్గొన్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త

## కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుల నియామకం

**బెజ్జంకి, జూలై 22, ప్రభాతవార్త :** బెజ్జంకి మండలం రేగులపల్లి, బెజ్జంకి క్రాసింగ్ గ్రామశాఖ అధ్యక్షులను బుధవారం నియమించి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్ చేతుల మీదుగా నియామకం పత్రాలను అందజేశారు. రేగులపల్లి కాంగ్రెస్‌పార్టీ గ్రామ అధ్యక్షులుగా కొట్టే రాజు, బెజ్జంకి క్రాసింగ్ గ్రామశాఖ అధ్యక్షులుగా కళ్లెం పోచయ్యలను నియమించి నియామకం పత్రాలను అందజేసి మాట్లాడారు. రాష్ట్ర సర్కార్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలన్నారు. పార్టీలో కష్ట పడి పని చేసే వారికి తప్పకుండా గుర్తింపు లభిస్తుందన్నారు. అనంతరం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గు దామోదర్ నూతన గ్రామశాఖ అధ్యక్షులను శాలువాలతో ఘనంగా సత్కారించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు జంగిలి లక్ష్మీ తిరుపతి, గాజ రవళి శ్రీనివాస్, జీల లింగం, ప్రసాద్, తిరుపతిరెడ్డి, జెల్ల ప్రభాకర్, రావుల నర్సయ్య, కర్రావుల సందీప్, బండి వేణు, సంగ రమేష్, ప్రశాంత్, చంద్రయ్య, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ భూములను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ హైమావతి

## ప్రభుత్వ భూముల కబ్జాకాకుండా నిఘా పెట్టాలి

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

**చిన్నకోడూరు, జూలై 22, ప్రభాతవార్త :** మండలంలో పలు ప్రభుత్వ స్థలాలను సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతగిరి రిజర్వాయర్ సమీపంలోని కిష్టాపూర్ గ్రామ శివారులోగల ఇల్లంతకుంట వెళ్లే రోడ్ వెంబడిగల 10 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వస్థలం చుట్టూ సర్వే నిర్వహించి హద్దులు వేసుకోవాలని, ఆక్రమణలకు గురికాకుండా నిఘా పెట్టాలని తహసీల్దార్ సలీంను ఆదేశించారు. అనంతరం మండలంలోని అల్లీపూర్ శివారులోని అనంతగిరి రిజర్వాయర్ పక్కనగల నీటిపారుదలశాఖ స్థలాన్ని పరిశీలించారు.

### ఎల్‌నినోపై నేడు సమీక్ష..హాజరు కానున్న మంత్రి పొన్నం...

**హుస్నాబాద్ రూరల్, జూలై 22, ప్రభాతవార్త :** వానకాలం-2026 ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు హుస్నాబాద్ నియోజకవర్గంలోని 7 మండలాలకు సంబంధించి నిర్వహించనున్న సమీక్షా సమావేశం కోసం చేపట్టిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ కె.హైమావతి బుధవారం పరిశీలించారు. ఈనెల 23న హుస్నాబాద్ ఐఓసీలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశానికి మూడు జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయ, ఉద్యానవన, గ్రామ పంచాయతీ, గ్రామీణాభివృద్ధి, నీటిపారుదల, విద్యుత్ తదితర శాఖల అధికారులు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ సమావేశ వేదిక, విద్యుత్ సదుపాయం, ప్రొజెక్టర్ ఏర్పాటు తదితర అంశాలను పరిశీలించారు. ఆయాశాఖలు ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రూపొందించిన కార్యాచరణ ప్రణాళికలను ప్రొజెక్టర్ ద్వారా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మూడు జిల్లాలకు చెందిన అధికారులు, 7 మండలాల ప్రతినిధులు హాజరవుతున్న నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లుచేయాలని ఆర్డీఓ రామ్మూర్తిని ఆదేశించారు. కార్యక్రమం ఉదయం నుంచి సాయంత్రం వరకు సాగుతుందన్నారు.

### విద్యార్థుల వసతిపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి...

హుస్నాబాద్ శాతవాహన ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల వసతి కోసం తాత్కాలికంగా కేటాయించిన రైతుబజార్ భవనాన్ని జిల్లా కలెక్టర్ కె.హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పట్టణంలోని 20వ వార్డులో ఉన్న రైతుబజార్ భవనం మొదటి, రెండవ అంతస్తులను సందర్శించి విద్యార్థులకు కల్పిస్తున్న వసతి సదుపాయాలను పరిశీలించారు. శాశ్వత ఇంజనీరింగ్ కళాశాల భవన నిర్మాణం పూర్తయ్యేవరకు విద్యార్థులకు ఇక్కడే తాత్కాలిక వసతి కల్పిస్తున్న నేపథ్యంలో మౌలిక వసతులు, మరుగుదొడ్లు, తాగునీరు, భోజన ఏర్పాట్లు తదితర అంశాలపై కలెక్టర్ అధికారులకు, కళాశాల యాజమాన్యానికి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలను సక్రమంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల వసతి, భద్రత, పరిశుభ్రత అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్న కలెక్టర్ శాతవాహన ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యంతో సమన్వయం చేసుకుని అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ రామ్మూర్తి, తహశీల్దార్, శాతవాహన ఇంజనీరింగ్ కళాశాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## విభజన రాజకీయాలకు తెరలేపుతున్న కాంగ్రెస్

### బిజెపి నాయకులు

**గజ్వేల్, జూలై 22 (ప్రభాతవార్త):** నీట్ విద్యార్థుల ముసుగులో కాంగ్రెస్ పార్టీ అల్ట్రా లెఫ్ట్, దేశ వ్యతిరేక శక్తులను కలుపుకుని మరోసారి విభజన రాజకీయాలకు తెరలేపుతుందని బిజెపి రాష్ట్ర అధి కార ప్రతినిధి కప్పర ప్రసాద్‌రావు, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్‌యాదవ్ అన్నారు. బుధవారం గజ్వేల్‌లోని అంబేద్కర్ చౌరస్తా లో బిజెపి ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జునఖర్గే చిత్రపటాలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్ల మెంట్ సమావేశాలు జరుగుతున్నప్పుడు ఒక బాధ్యత గల ప్రతిపక్ష నాయకుడిగా సభలో ప్రజా సమస్యలపై మాట్లాడాల్సిన రాహుల్‌గాంధీ ప్రధాని నివాసం ముందు నిరసనల పేరుతో డ్రామాలు ఆడటం ప్రజాస్వామ్యానికి పూర్తిగా విరుద్ధం అన్నారు. నీట్ అంశంపై కేంద్ర ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉన్నా, మాట్లాడటానికి సరైన విషయం లేక ఆయన పార్ల మెంట్‌ను వదిలేసి రోడ్ల మీద నాటకాలు చేస్తున్నా రని మండిపడ్డారు. ఈ నిరసనల్లో చైనా, పాకిస్థాన్ లకు మద్దతు పలికే వ్యక్తులు, ఆర్టికల్ 370ని మళ్లీ తేవాలని అడిగేవాళ్లు, దేశ వ్యతిరేక నినాదాలు చేసే జమాతే ఇస్లామీలాంటి వాళ్లు రాహుల్‌గాంధీకి మద్దతు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. దేశ వ్యతిరేక శక్తుల డ్రామాలకు ముఖ్యమంత్రి వత్తాసు పలకడం అత్యంత విచారకరమన్నారు. ఢిల్లీలో జరుగుతున్న సంఘట నలు చూస్తుంటే హింసాత్మక సంఘటనల వెనుక పెద్ద కుట్ర కనబడుతోందని, నిరసనల పేరుతో కొన్ని రాజకీయ పార్టీలు వీధుల్లో అరాచకానికి తెరలేపి, దేశ భద్రత, సాధారణ పౌరులు మరియు భద్రతా సిబ్బంది ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టాయని అన్నారు. ఢిల్లీలో జరుగుతున్న నిరసనలపై ప్రతి పౌరుడు గమనించాలని, పేపర్ లీకేవంటి సంఘటనలు జరిగితే వాటిపై నిష్పక్షపాత విచారణ జరగాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఏ నిరసన అయినా శాంతియుతంగా, చట్టబద్ధంగా జరగాలని, హింస, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం, భద్రతా సిబ్బందిపై దాడులు లేదా ప్రజ ల్లో ఉద్రిక్తతలు పెంచే చర్యలు జరిగితే వాటిని కూడా అదే స్థాయిలో ప్రశ్నిస్తే రాజకీయాలు, ప్రభుత్వాలు మారుతాయని అన్నారు. భారతదేశం ఐక్యత, ప్రజాస్వామ్యం, శాంతి వీటిని కాపాడటం మనందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడి పల్లి భాస్కర్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి నత్తి మల్లేశం, ఉపాధ్యక్షుడు టేకులపల్లి బాల్‌రెడ్డి, కార్య దర్శి ఎల్కంటి సురేష్, నాయకులు జిల్లా రమేష్, తూప్రాన్ మండల అధ్యక్షుడు పిట్ల పోచయ్య, కౌన్సిలర్ చందా అశోక్‌యాదవ్, బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యుడు చెప్యాల వెంకటరెడ్డి, గజ్వేల్ పట్టణ, మండల ప్రధానకార్యదర్శులు నాయిని సందీప్‌కుమార్, మదుగురి నరసింహ, బారు అరవింద్, ఇప్ప స్వామి, కొట్టాల మల్లేశం, ఎండోమెంట్ సెల్ జిల్లా కన్వీనర్ కాశమైన సందీప్‌కుమార్, నాయకులు కొంతం సుధాకర్, మేడ పర్వతాలు, అంజి, నరేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ చౌరస్తాలో మాట్లాడుతున్న బిజెపి నాయకులు

# నీట్ లీక్‌ను కప్పిపుచ్చేందుకే అణచివేత

### రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్ రూరల్, జూలై 22, ప్రభాతవార్త**

నీట్‌పేపర్ లీకేజీ వ్యవహారాన్ని కప్పిపుచ్చేందుకే కేంద్ర ప్రభుత్వం నిరసనలను అణచివేస్తోందని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. లోకసభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీతో పాటు పలువురు కాంగ్రెస్ ఎంపీల అరెస్టులకు నిరసనగా బుధవారం హుస్నాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్ ఘటన దేశ ప్రజాస్వామ్య చరిత్రలో ఒక మచ్చగా మిగిలిపోతుందన్నారు. నీట్ పేపర్ లీకేజీపై సమాధానం చెప్పాల్సిన కేంద్ర ప్రభుత్వం, ప్రశ్నిస్తున్న విద్యార్థులను, వారికి మద్దతుగా నిలిచిన ప్రతిపక్ష నాయకులను అణచివేయడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. నీట్ పేపర్ లీక్ కారణంగా లక్షలాదిమంది విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారని, కొందరు ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. అలాంటి కీలక అంశంపై పార్లమెంట్‌లో చర్చ జరగాల్సి ఉండగా, ప్రజల దృష్టిని మళ్లించేందుకే నిరసనలను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీతోపాటు వందలాది మంది ఎంపీలు శాంతియుతంగా ఆందోళన చేస్తుండగా అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్య హక్కులపై దాడి అన్నారు. విద్యార్థులపై పోలీసులు లాఠీలు ఝుళిపిస్తుంటే కేంద్ర ప్రభుత్వం మౌనంగా ఉండడం బాధాకరమని, గాయపడిన విద్యార్థులకు న్యాయంచేయాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్నారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లీకేజీకి కారణమైన వారిని కఠినంగా శిక్షించడంతోపాటు, ఈ ఘటనల వల్ల నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. లాఠీచార్జ్ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికి ఉందని, ఆ హక్కును కాలరాస్తే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. మహాధర్నాలో వివిధ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, సర్పంచులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్





బిజెపి నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

## దేశ ప్రతిష్టను దిగజార్చడానికి రాహుల్‌గాంధీ ప్రయత్నం

### బిజెపి జిల్లా అధ్యక్షుడు శంకర్‌ముదిరాజ్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

అంతర్జాతీయ శక్తులతో చేతుల కలిపి భారతదేశ ప్రతిష్టను దిగజార్చడానికి... దేశంలో అశాంతి రేకెత్తించడానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రయత్నిస్తున్నారని బిజెపి జిల్లా అధ్యక్షులు బైరి శంకర్‌ముదిరాజ్ ఆరోపించారు. నిరసనల పేరుతో కాంగ్రెస్ నేతలు ప్రధానమంత్రి నివాసాన్ని ముట్టడించడాన్ని నిరసిస్తూ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని పాత బస్టాండు అంబేద్కర్ సర్కిల్‌లో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను పార్టీ శ్రేణులతో కలిసి దగ్ధం చేయడానికి యత్నించగా పోలీసులు అడ్డుకొని టూ టౌన్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ వైఖరిని ఎండగట్టారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష పాత్ర వేరని అరాచకం సృష్టించడం వేరని మండిపడ్డారు. ఢిల్లీలో జరుగుతున్న నిరసనల్లో అసలైన విద్యార్థుల కంటే రాజకీయ ప్రేరేపిత శక్తులే ఎక్కువగా ఉన్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్ అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ అడ్రస్ గల్లంతవుతుందన్నారు. కార్యక్రమంలో పట్టణ బిజెపి అధ్యక్షులు బాసంగారి వెంకట్, కాసానిగొట్టు సంతోష్, గుండ్ల జనార్ధన్, బొమ్మగాని పద్మ, అరిగే యాదగిరి, కొంగర పవన్, గాడిచెర్లపల్లి శ్రీనివాస్, బొల్లివెని యాదగిరి, విద్యాసాగర్, మహేందర్‌రావు, రవితేజ, స్వామి తదితరులు పాల్గొన్నారు.

### ఆషాడ బోనాల మహోత్సవాలకు ప్రభుత్వాధికారులకు ఆహ్వానం

**గజ్వేల్ టౌన్, జూలై 22 (ప్రభాతవార్త):** పట్టణంలోని శ్రీమహంకాళి అమ్మవారి ఆషాడ బోనాల మహోత్సవాల సందర్భంగా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందన రవీందర్, వైస్ చైర్మన్ కళ్యాణ్‌కార్ పద్మాబాయి నర్సింగరావు, మున్సిపల్‌కౌన్సిలర్లు బుధవారం వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులను కలిసి బోనాల మహోత్సవాల ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలకు విచ్చేసి అమ్మవారి ఆశీస్సులు పొందాలని, ఉత్సవాలను విజయవంతం చేయడంలో తమ సహకారం అందించాలని కోరారు. ప్రభుత్వ అధికారులు ఆహ్వానాన్ని సాదరంగా స్వీకరించి, బోనాల మహోత్సవాలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు.



గజ్వేల్‌లో బైఠాయించి నిరసన తెలుపుతున్న కాంగ్రెస్‌నేతలు, విద్యార్థులు

## నీట్ లీకేజీకి బాధ్యత వహిస్తూ ప్రధాని మోడీ రాజీనామా చేయాలి

### సిద్దిపేట డిసిసి అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షరెడ్డి

**గజ్వేల్, జూలై 22 (ప్రభాతవార్త):** నీట్ పరీక్ష పత్రాల లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, లేని పక్షంలో రాష్ట్రపతి చొరవచూపి బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లా అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షరెడ్డి, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం గజ్వేల్‌లో విద్యార్థులు, కాంగ్రెస్ కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించి కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, అమిత్‌షా దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఢిల్లీలో జంతర్‌మంతర్, పార్లమెంట్ వద్ద విద్యార్థులు శాంతియుతంగా, ప్రజాస్వామ్య బద్ధంగా నిరసన వ్యక్తం చేస్తుండగా, వారిని పోలీసులు విచక్షణారహితంగా కొట్టడం తగదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులపై పోలీసుల దాడిని నిరసిస్తూ వారి ఆందోళనకు సంఘీభావంగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, ఎంపి ప్రియాంకగాంధీ తదితర ప్రముఖులు ప్రధాని నివాసం వద్ద నిరసన తెలుపుతుండగా వారిని అక్రమంగా నిర్బంధించి ఈడ్చుకెళ్లడం సహించరానిదని విమర్శించారు. కేంద్రంలో బిజెపి సర్కార్ అధికా రం చేపట్టిన నాటి నుండి కార్పొరేట్‌లకు కొమ్ము కాస్తుండగా, విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న నీట్ పరీక్షా పత్రాలు అమ్ముకోవడం సిగ్గు చేటని విమర్శించారు. అప్రజాస్వామిక పద్ధతుల్లో పాలన చేస్తున్న ప్రధాని మోడి, కేంద్ర మంత్రి అమిత్‌షాలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయ మని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్లు నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విజయ మోహన్, శ్రీనివాస్‌రెడ్డి, పిసిసి నాయకులు నాయిని యాదగిరి, ఏఎంసి వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, ఆత్మ కమిటీ చైర్మన్ కనకయ్య, పట్టణ పార్టీ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, మండల పార్టీ బాధ్యులు సుఖేందర్ రెడ్డి, కరుణాకర్, ఐలయ్య, నర్సింలు, షాదుల్లా, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, సర్పంచులు గోపాల్, కరుణాకర్, ప్రశాంత్, కౌన్సిలర్లు నర్సింహారెడ్డి, ఉపేందర్‌రెడ్డి, విష్ణు, రమేష్, నాయకులు గుంటుకు శ్రీనివాస్, నక్క రాములు గౌడ్, రమేష్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, మహేష్, డాక్టర్ వహీద్, కరుణాకర్‌రెడ్డి, జకీర్, అజహార్, ప్రమోద్, బాబు, తఖీ, నరేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పిసిఆర్, పిఒఏ చట్టాలను పకడ్బందీగా అమలుచేయాలి

### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి బ్యూరో, జూలై 22, ప్రభాతవార్త :**

పీసీఆర్, పీఓఏ చట్టాలను జిల్లాలో మరింత సమర్థవంతంగా అమలుచేసి, బాధితులకు త్వరగా న్యాయం అందేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం, పీసీఆర్, పీఓఏ చట్టాల అమలుపై సమీక్షా సమావేశం బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సమాజంలో చోటుచేసుకునే ఎస్సీ, ఎస్టీలపై వివక్ష, అట్రాసిటీ ఘటనలను అత్యంత బాధ్యతాయుతంగా పరిగణించాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వెలుగులోకి రాని వాస్తవ ఘటనలను రెవెన్యూ, పోలీసు అధికారులు గుర్తించి, వాస్తవమైన ప్రతి కేసును నిబంధనల ప్రకారం నమోదు చేయాలని సూచించారు. బాధితులకు చట్టప్రకారం అందాల్సిన రక్షణ, సహాయం, ఆర్థిక ఉపశమనం, న్యాయం సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రతి నెల 30వ తేదీన సివిల్ రైట్స్ డే నిర్వహించాలని, ప్రతి రెవెన్యూ డివిజన్‌లో సబ్ డివిజనల్ స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీలను ఏర్పాటుచేయాలని ఆర్డీవోలకు ఆదేశించారు. 2022 నుండి ఇప్పటివరకు జిల్లాలో నమోదైన 144 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు ఆర్థిక ఉపశమనం కింద సుమారు రూ. 2.58 కోట్ల నిధులు అవసరమవగా, ఇప్పటి వరకు రూ.1.74 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. అందులో 37 మంది బాధితులకు రూ.68,87,500 విడుదల చేసినట్లు, మిగిలిన అర్హులైన బాధితులకు ఆర్థిక ఉపశమనం అందజేసే ప్రక్రియ కొనసాగుతున్నట్లు వివరించారు. సమావేశంలో పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతిపై జిల్లా కలెక్టర్ డీఎస్పీలను కేసుల వారీగా వివరాలు అడిగి తెలుసుకుని, దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో ఎలాంటి జాప్యానికి తావివ్వకుండా బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా అధికారులు పని చేయాలని సూచించారు. దర్యాప్తును నిర్ణీత గడువులో పూర్తిచేసి చార్జిషీట్లు దాఖలు చేయాలని, గ్రామ, మండల స్థాయి కమిటీల ద్వారా అర్హులైన వారికి కుల ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందజేయాలని అన్నారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ, 2026 జూన్ నెలాఖరు వరకు జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద 31 కేసులు నమోదయ్యాయని తెలిపారు. అందులో 12 కేసులు దర్యాప్తు దశలో ఉండగా, 19 కేసుల్లో చార్జిషీట్లు దాఖలు చేసినట్లు తెలిపారు. ప్రతి కేసులో బాధితులకు పూర్తి రక్షణ కల్పిస్తూ, చట్ట ప్రకారం సత్వర న్యాయం అందేలా పోలీసు శాఖ చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పాండు, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ అఖిలేష్ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి, వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ జిల్లా అధికారి జగదీష్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సత్యనారాయణ, ఏసీపీలు, డీఎస్పీలు, రెవెన్యూ డివిజనల్ అధికారులు రాజేందర్, దేవుజ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్



బైక్ ర్యాలీలో పాల్గొన్న టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

## అక్రమ అరెస్టులను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ, విద్యాసంస్థల బంద్

### పాల్గొన్న టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

**సంగారెడ్డి బ్యూరో, జూలై 22 ప్రభాతవార్త :** కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మరియు ప్రతిపక్ష పార్టీల నేతలను అరెస్టు చేయడానికి నిరసిస్తూ సంగారెడ్డిలో బుధవారం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. సంగారెడ్డి నియోజకవర్గంలోని విద్యాసంస్థల బంద్‌కు పిలుపు నిచ్చారు. విద్యాసంస్థల బంద్ పిలుపును పురస్కరించుకొని నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను మూసివేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ర్యాలీలో టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజీఐసీ చైర్పర్సన్, సంగారెడ్డిజిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి, ప్రజా పతినిధులు, కౌన్సిలర్లు, మండల పార్టీ అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుల అరెస్టును నిరసిస్తూ మంగళవారం రాత్రి హైదరాబాద్ ముంబై ప్రధాన హైవే పై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. రాస్తారోకోతో ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. స్థానిక పోలీసులు జోక్యం చేసుకొని రాస్తారోకోను విరమింప చేశారు.

## జహీరాబాద్‌కు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ మంజూరు చేయాలి



డీజీపీని కలిసిన ఎమ్మెల్యేలు మాణిక్‌రావు, చింతల ప్రభాకర్

**సంగారెడ్డి, జూలై 22 ప్రభాతవార్త :** జహీరాబాద్ పట్టణం రోజురోజుకు విస్తరిస్తుండడంతో ట్రాఫిక్ రద్దీ పెరగడంతో ట్రాఫిక్ సమస్యను అధిగమించడానికి జహీరాబాద్‌కు నూతన ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ మంజూరు చేయాలని ఎమ్మెల్యే మాణిక్యరావు బుధవారం సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ డీసీఎంఎస్ మాజీ చైర్మన్ శివకుమార్‌తో కలిసి, హైదరాబాద్‌లోని రాష్ట్ర డీజీపీ సివి ఆనంద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జహీరాబాద్ నియోజకవర్గంలో రోజురోజుకు పెరుగుతున్న జనాభా, విస్తరిస్తున్న పట్టణ పరిధి, పరిశ్రమల అభివృద్ధి, విద్యాసంస్థలు, ప్రజా రవాణా వాహనాల రద్దీ కారణంగా ట్రాఫిక్ సమస్య తీవ్రరూపం దాల్చిందని డీజీపీ దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా, జహీరాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌ను అప్‌గ్రేడ్ చేయడంతో పాటు, ట్రాఫిక్ నియంత్రణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు నూతన ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు.



పోలీసుల ఆదుపులో యువకుడు

## పోలీసుల విధులకు అంతరాయం కలిగించిన యువకుడి అరెస్ట్

**న్యాల్‌కల్, జూలై 22, ప్రభాతవార్త:** మద్యం మత్తులో అత్యవసర సేవలకు ఏర్పాటు చేసిన 100కు డయల్ చేస్తూ పోలీసుల సేవలకు అంతరాయం కల్గించిన యువకుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ దోమ సుజిత్ పేర్కొన్నారు. ఎస్ఐ సుజత్ దోమ కథనం ప్రకారం... హద్నూర్ పోలీసు ఠాణా పరిధిలోని వడ్డి గ్రామానికి చెందిన బోజ్‌గొండ మారుతి మద్యం మత్తులో పలుమార్లు అత్యవసర 100కు కాల్‌చేస్తూ పోలీసు సేవలకు అంతరాయం కల్గించాడన్నారు. పోలీసు సేవలకు అంతరాయం కల్గడంతోపాటు ప్రజా శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా ప్రవర్తించిన బోజ్‌గొండ మారుతిపై పిటీ కేసు నమోదు చేశామన్నారు. అత్యవసర సేవల నంబర్లు ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ కోసం మాత్రమే వినియోగించాలని, మద్యం సేవించి సరదా కోసం తప్పుడు లేదా అనవసరంగా కాల్ చేయడం చట్ట విరుద్ధమని ఎస్ఐ దోమ సుజిత్ పేర్కొన్నారు.

## ద్విచక్ర వాహనం, ఆటోను ఢీ కొట్టిన కారు ఇద్దరికి తీవ్ర గాయాలు

**బెజ్జంకి, జూలై 22, ప్రభాతవార్త :** మండల పరిధిలోని ముత్తన్నపేట గ్రామ శివారులో ప్రధాన రోడ్డుపై బుధవారం కారు బీభత్సం సృష్టించింది. ద్విచక్ర వాహనాన్ని, ఆటోను కారు వెనుకనుంచి ఢీకొట్టడంతో వాహనాలు బోల్తాపడ్డాయి. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న దాచారం గ్రామానికి చెందిన కనగండ్ల పోచయ్య, ఆటో డ్రైవర్ ఐలయ్యకు గాయాలు కాగా చికిత్స నిమిత్తం 108 సిబ్బంది కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించి కారణాలు అడిగి తెలుసుకున్నారు. మద్యం మత్తులోనే ప్రమాదం జరిగినట్లు ఎస్ఐ వివరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిరుపతి వివరించారు.



కారు ఢీ కొట్టడంతో బోల్తాపడిన ఆటో



మిరుదొడ్డిలో నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

## రాహుల్ అరెస్టును ఖండిస్తూ కాంగ్రెస్ నేతల నిరసన

**తొగుట, జులై 22,ప్రభాతవార్త :** ప్రజాసమస్యలపై పోరాడుతున్న లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీని అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువలపై జరిగిన దాడి అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పంది రాజు అన్నారు. రాహుల్‌గాంధీ అరెస్టును ఖండిస్తూ నిరసన కార్యక్రమం బుధవారం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్, ప్రజల హక్కుల పరిరక్షణ కోసం శాంతియుతంగా చేపట్టిన నిరసనను అణచివేసేందుకు అరెస్టు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు రమేష్, నర్సక్క, బాలమల్లు, బిక్షపతి, నరసింహారెడ్డి, బాల్‌రెడ్డి, మల్లారెడ్డి, శ్రీకర్‌రెడ్డి, అనిల్, ఉప్పలయ్య, భరత్‌స్వామి, షఫి, నాగరాజు, అర్జున్, స్వామి, నరేష్, సాగర్, స్వామిగౌడ్ పాల్గొన్నారు.

**మిరుదొడ్డిలో...**

రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, ఇతర ప్రతిపక్షనేతల అరెస్టును ఖండిస్తూ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నర్ర రాజిరెడ్డి పార్టీ నాయకులతో కలిసి మోడీ దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. రాహుల్‌గాంధీకి, విద్యార్థులకు బేషరతుగా క్షమాపణ చెప్పి కేంద్ర విద్యాశాఖ మంత్రి, మోడీ, అమిత్‌షా వెంటనే రాజీనామాలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎఎంసి వైస్ చైర్మన్ చెన్నై భూపాల్‌గౌడ్, నేరండ్ల భూమాగౌడ్, గజ్జల సాయిలు, మంచాల మల్లేశం, మల్కాపురం నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

**సిద్దిపేటలో...**



సిద్దిపేటలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

**సిద్దిపేట అర్బన్, జులై 22,ప్రభాతవార్త :** నీట్ పరీక్ష పత్రాలు లీకేజీ వ్యవహారంపై నిలదీసినందుకు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై మోడీ ప్రభుత్వం దాడి చేయడం అప్రజాస్వామికం అని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు ఎం.డి.ఇమామ్(అత్తు) అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో విక్టరీ చౌరస్తా నుంచి పాత బస్టాండు అంబేద్కర్ సర్కిల్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ పరీక్ష లీకేజీ వ్యవహారం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీ చార్జ్ చేయడాన్ని నిరసిస్తూ రాహుల్‌గాంధీ మోడీ ఇంటి ఎదుట ధర్నా చేయడంతో ఆయనపైనా దాడి చేసి గాయపరిచినందుకు నిరసనగా ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. ఢిల్లీలో శాంతియుతంలగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు లాఠీ చార్జ్ చేయడం సరికాదన్నారు. విద్యార్థులపై దాడి చేసిన మోడీ పాపం ఊరికే పోదన్నారు.నీట్ పరీక్ష రద్దుతో ఆత్మహత్యకు పాల్పడిన విద్యార్థుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పూజల గోపికృష్ణ, బొమ్మల యాదగిరి, గంప మహేందర్‌రావు, సతీష్, రాజుబహదూర్‌రెడ్డి, మెరుగు రాజు, హర్షద్, గయాజొద్దీన్, సంతోషి, ప్రవీణ్, ప్రభాకర్, విజయ్, అతిఫ, సుధీర్, నరేష్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

**చిన్నకోడూరులో...**



మోడీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

**చిన్నకోడూరు, జులై 22, ప్రభాతవార్త :** లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతుందని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ప్రధాని నరేంద్రమోడీ దిష్టిబొమ్మను చిన్నకోడూరులో దహనం చేశారు. ఈ సందర్భంగా టిపిసిసి సభ్యులు, నంగునూర్ ఎఎంసి చైర్మన్ దేవులపల్లి యాదగిరి, చిన్నకోడూరు ఎఎంసి చైర్మన్ మీసం మహేందర్‌యాదవ్ మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాహుల్‌గాంధీతోపాటు ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు హరిబాబు, నవీన్, చంద్రశేఖర్, రాజేష్, ప్రశాంత్, కనకయ్య, చందు, గణేష్‌గౌడ్, పరుశరాములుయాదవ్,యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులపై లాఠీఛార్జి ప్రజాస్వామ్యంపై హత్య




మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నేతలు

**సిద్దిపేట రూరల్, జులై 22, ప్రభాతవార్త :** పార్లమెంట్ సమీపంలో న్యాయమైన డిమాండ్ల సాధనకోసం శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసిన విద్యార్థులపై కేంద్రప్రభుత్వం జరిపిన లాఠీచార్జ్‌ని ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి తీవ్రంగా ఖండిస్తున్నట్లు జిల్లా సహాయ కార్యదర్శి వేల్పుల ప్రసన్నకుమార్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యార్థులపై లాఠీచార్జ్ ప్రజాస్వామ్య హత్యేనని తెలిపారు. ప్రజాస్వామ్యం దేశంలో విద్యార్థులు తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు శాంతియుతంగా నిరసన తెలిపినా...వారి గొంతును లాఠీలతో అణచివేడయం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ నియంతృత్వ ధోరణికి నిదర్శనమన్నారు. నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలన్నారు. విద్యార్థులపై దాడులు కొనసాగితే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు నవీన్, మోహన్, గణేష్,రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగహన

**రాయపోల్, జులై 22 ప్రభాతవార్త :** మండలంలోని వడ్డేపల్లి, రాంసాగర్, ముంగిసపల్లి, ఎల్కల్ గ్రామాల్లో ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి మండల ప్రత్యేక అధికారి, గజ్వేల్ డివిజన్ ఏడిఏ బాబునాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వానకాలంలో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. వరి సాగుకు బదులుగా జొన్న, సజ్జ, రాగులు మొక్కజొన్న, కంది, పెసర, మినుము, నువ్వులు, వేరుశనగ వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు.అలాగే ఫార్మ్ పాండ్స్ సబ్సిడీ పథకాన్ని వినియోగించుకుని వర్షపు నీటిని నిల్వ చేసుకోవడం ద్వారా పంటలకు అవసరమైన సమయంలో నీటిపారుదల అందించవచ్చున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి నరేష్, ఏపీఎం యాదగిరి, వడ్డేపల్లి సర్పంచ్ రాజాగారి రేణుక, రాంసాగర్ సర్పంచ్ నరేష్‌గౌడ్, ఎల్కల్ సర్పంచ్ పిట్ల చిన్న వెంకటయ్యతో పాటు ప్రజాప్రతినిధులు, వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు

# ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్‌లో 60 మంది చేరిక..

### ..జిల్లా కన్వీనర్‌గా ఎస్.చిరంజీవి నియామకం




మాట్లాడుతున్న ఎఐఎఫ్‌బి నాయకులు.

**నారాయణఖేడ్, జులై 22, ప్రభాతవార్త:** నారాయణఖేడ్ పట్టణంలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఎఐఎఫ్‌బి)పార్టీ జిల్లా స్థాయి విస్తృత సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కమ్యూనిస్టు పార్టీలకు చెందిన సుమారు 60 మంది కార్యకర్తలు ఎస్.చిరంజీవి ఆధ్వర్యంలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలో చేరారు. పార్టీ రాష్ట్రనాయకులు వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న ఎస్.చిరంజీవిని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కన్వీనర్‌గా నియమిస్తూ పార్టీ నాయకత్వం అధికారికంగా బాధ్యతలు అప్పగించింది. ఈ సందర్భంగా నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జోజిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బి. రాములుయాదవ్ పార్టీ విస్తరణ, ప్రజా సమస్యలు, ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై ప్రసంగించారు. ఈ సందర్భంగా జోజిరెడ్డి మాట్లాడుతూ, తెలంగాణలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీని గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి కార్యకర్త ప్రజల్లోకివెళ్లి పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలను విస్తృతంగా ప్రచారం చేస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్యదర్శి బి.రాములుయాదవ్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీక్ ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే ఇటువంటిఘటనలు పునరావృతంకాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలు ఆశించిన స్థాయిలో పాలన అందించడం లేదని విమర్శిస్తూ, ప్రజాసమస్యల పరిష్కారానికి, సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లాకన్వీనర్ ఎస్.చిరంజీవి, లక్ష్మణ్, మోచప్ప, గణేష్ సోయల్, శోభ, పండరి తదితరరాష్ట్ర, జిల్లానాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## హైస్కూల్‌లో తహసీల్దార్ ఆకస్మికతనిఖీ



తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం

**మొగుడంపల్లి, జులై 22, ప్రభాతవార్త:** మొగుడంపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌ను తహసీల్దార్ శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీచేశారు. పాఠశాల పరిశుభ్రత, తాగునీటి సదుపాయాలు, మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. బియ్యం నిల్వలను తనిఖీచేసి, మెనూ ప్రకారం ప్రతిరోజూ నాణ్యమైన భోజనం అందించాలని భోజన ఏజెన్సీ సిబ్బందికి సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమంపై ప్రత్యేకశ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జుబేర్, ఆర్ఐ రామారావు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ సర్వేను పర్యవేక్షించిన కాంగ్రెస్‌నేతలు

### -బిఎల్‌వో సూపర్వైజర్లకు నివేదికల సమర్పణపై దిశానిర్దేశం



ఎస్ఐఆర్ ఫోరం అందిస్తున్న దృశ్యం

**కొల్చారం, జులై 22, ప్రభాతవార్త:** కొల్చారం మండల కేంద్రంతో పాటు చిన్న ఘనాపూర్ గ్రామపంచాయతీలో జరుగుతున్న ఎస్ఐఆర్ ఓటర్ సమగ్ర సర్వే ప్రక్రియను బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పరిశీలించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, జిల్లా కోఆర్డినేటర్ అన్వేష్‌రెడ్డి ఆదేశాల మేరకు నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఓటర్ల నమోదు, ధృవీకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియ ఎలా జరుగుతోందనే అంశాలను పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. అలాగే మండలంలోని బిఎల్‌వో సూపర్వైజర్లకు రోజువారీ నివేదికలను ఏ విధంగా సిద్ధం చేసి సమర్పించాలనే అంశంపై దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో కొల్చారం గ్రామ సర్పంచ్ దేవనగారి శేఖర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లేశం గౌడ్, చిన్నఘనాపూర్ సర్పంచ్ చందాపురం మల్సన్‌రెడ్డి, సూపర్వైజర్ ప్రవీణ్‌రెడ్డి, ఉపసర్పంచ్ నర్సింలు, రమేష్, శ్రీశైలం, సంతు, కారోబార్ వడ్ల ప్రభాకర్, నాగరాజు, బిఎల్‌వోలు అశోక్, శ్రావణ్, ఖలీల్, పెట్టేరి స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## నూతన సిఐకి ఘనసన్మానం

### -దివ్యాంగుల సమస్యలు, సంక్షేమ అంశాలపై చర్చ




సిఐ సైదాను సన్మానిస్తున్న దివ్యాంగులసంక్షేమ సంఘం ప్రతినిధులు

**రామాయంపేట, జులై 22, ప్రభాతవార్త:** మెదక్ జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రామాయంపేటకు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సిఐ సైదానాయక్‌ను బుధవారం ఘనంగా సన్మానించారు. జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కుమ్మరి కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో సిఐకు పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దివ్యాంగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు, వారి భద్రత, సంక్షేమం, ప్రభుత్వ పథకాల అమలు, అవసరమైన సహకారం వంటి పలు అంశాలపై సిఐతో ప్రతినిధులు చర్చించారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి పోలీసు శాఖ తరపున అవసరమైన సహకారం అందిస్తామని సిఐ సైదానాయక్ హామీ ఇచ్చినట్లు సంఘం నాయకులు తెలిపారు. కార్యక్రమంలో బాచుపల్లి పాండు, వస్రంనాయక్, పాశం రమేష్, సంధిగళ్ల భూమయ్య, భిక్షానాయక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన ఉపాధ్యాయుల వృత్త్యంతర శిక్షణ

**మునిపల్లి, జులై 22, ప్రభాతవార్త:** మండలంలోని ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం, ఉపాధ్యాయుల బోధనను మరింత బలోపేతంచేయడం, వారి వృత్తినైపుణ్యాలను పెంపొందించడం, విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలను సాధింపజేయడం లక్ష్యంగా మండల ఉపాధ్యాయులకి నిర్వహిస్తున్న వృత్త్యంతర ఉపాధ్యాయశిక్షణ మొదటివిడత విజయవంతంగా ముగిసింది. దీనిలో భాగంగా 2026-27 విద్యాసంవత్సరానికి సంబంధించిన అకాడమిక్ ప్రాధాన్యతలు, విద్యార్థుల్లో కనీస అభ్యసనసామర్థ్యాల సాధన, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేకశ్రద్ధతో బోధననిర్వహించే విధానాలపై మండలంలోని ఉపాధ్యాయులకు శిక్షణ నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ పర్సన్ చంద్రమోళి, మండల రిసోర్స్ పర్సన్‌లు సంతోషమ్మ, సాయిలు, అనురాధ, ఉమారాణిలతోపాటు మండల ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## వనమహోత్సవంలో పాల్గొన్న ఎంపిడివో



మొక్కలను నాటుతున్న దృశ్యం

**కొల్చారం, జులై 22, ప్రభాతవార్త:** కొల్చారం మండలపరిధిలోని కొంగోడు గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో బుధవారం వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొల్చారం ఎంపిడివో రఫీకున్నీసా ఉపాధి హామీ (ఈజీఎస్) సిబ్బందితో కలిసి మొక్కలునాటి వాటికి నీరుపోశారు. ఈసందర్భంగా ఎంపిడివో మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. నాటిన ప్రతి మొక్కను బతికించేలా చర్యలు తీసుకుంటేనే వనమహోత్సవం లక్ష్యం నెరవేరుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కొంగోడు గ్రామ సర్పంచ్ స్వామి, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ నాయిని సత్యనారాయణ, గ్రామ కార్యదర్శి, ఈజీఎస్ సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్ల సరైన మరమ్మతులు లేక రైతుల కష్టాలు

### -విద్యుత్‌శాఖ నిర్లక్ష్యంతో నష్టపోతున్న రైతులు



మరమ్మతులు చేస్తున్న దృశ్యం

**గుమ్మడిదల, జులై 22, ప్రభాతవార్త:** గుమ్మడిదలమండలంలో విద్యుత్‌శాఖ అధికారుల పర్యవేక్షణ లోపంతో రైతులకు తీవ్రనష్టం వాటిల్లుతోందని చెప్పవచ్చు. వ్యవసాయ బోర్ల వద్ద ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. వాటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించకుండా గాలికి వదిలేశారు. విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం వలన గత నెలలో రామ్‌నగర్ పరిసర ప్రాంతంలో విద్యుత్ లోపాల కారణంతో సుమారు పదిమంది రైతుల బోరుమోటార్లు కాలిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరలా రెండురోజుల క్రిందట నాయినిచెరువు ప్రాంతంలో కూడా ఇదే సమస్య ఎదురై ఐదుగురు రైతుల బోరుమోటార్లు దెబ్బతిన్నాయని ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ సీజన్లో ఇటువంటి సంఘటనలు జరగడం వలన భయాందోళనలు చెందుతున్నామని వారు వాపోయారు. జరిగిన పరిణామాలపై విద్యుత్ శాఖ అధికారులు పూర్తిబాధ్యత వహించి తక్షణమే రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్‌చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి తగినచర్యలు చేపట్టాలని వారు కోరారు.

## యూనియన్ బ్యాంకులో సిబ్బంది కొరత

### ఇబ్బందులుపడుతున్న ఖాతాదారులు

**చిన్నశంకరంపేట, జులై 22, ప్రభాతవార్త:** మండల పరిధి మదూర్‌లోని సిబ్బంది కొరత కారణంగా ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సిబ్బంది కొరతతో పాటు, బ్యాంకులో ఇతర సమస్యలున్నా పట్టించుకునే వారు లేరని ఖాతాదారులు ఆరోపిస్తున్నారు. బ్యాంకులో ప్రింటర్ పనిచేయక నెలలు గడుస్తున్న ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ బ్యాంకు ద్వారా సుమారు 20 గ్రామాల రైతులు పంట రుణాలను తీసుకుంటారు. గజగట్లపల్లికి చెందిన ఓ ఖాతాదారుడు బ్యాంకు పాస్ పుస్తకంలో తన పేరు తప్పుగా ఉందని, ఆదార్ ప్రకారం తన పేరును సవరించాలని పది రోజులుగా తిరుగుతుంటే సోమవారం నాడు సిబ్బంది పేరును మార్చారు. కాని, బ్యాంకు పాస్‌పుస్తకం ఇవ్వడానికి ప్రింటర్ పనిచేయడంలేదని తెలిపారు. ఖాతాదారుడు ఎల్ఐసిలో పాలసీ తీసుకోగా అది ఇప్పుడు పూర్తయింది. డబ్బులను నేరుగా బ్యాంకు ఖాతాలో వేస్తామనడంతో పాస్ పుస్తకంలో పేరు తప్పు ఉండటంతో డబ్బులు జమ కాలేదు. కేవలం పేరు మార్చడానికే బ్యాంకు వారు 10 రోజుల సమయం తీసుకున్నారు. తీరా పుస్తకం ఇవ్వకపోవడంతో ఎల్ఐసీ డబ్బులు రాలేదని, ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ విషయమై వార్తా బ్యాంకు మేనేజర్ దిలీప్‌కుమార్‌ను వివరణ అడుగగా బ్యాంకులో సిబ్బంది కొరత ఉన్న మాట నిజమేనని, కేవలం ఇద్దరు సిబ్బంది మాత్రమే ఖాతాదారులకు సేవలను అందిస్తున్నామన్నారు. ప్రింటర్ పనిచేయక 8 నెలలు అవుతుందని, కర్ణాటక నుండి ఇటీవలే బదిలీపై ఇటీవలే వచ్చినట్లు తెలిపారు. సిబ్బందిలో ఒకరు అనారోగ్య సమస్యతో సెలవుపై వెళ్లినట్లు తెలిపారు. బ్యాంకుకు సిబ్బందిని పంపా లని ప్రధాన కార్యాలయానికి తెలిపామని, త్వరలో సమస్య పరిష్కారమవుతుందన్నారు.




మదూర్‌లోని యూనియన్ బ్యాంకు



మాట్లాడుతున్న కడవల్ల నర్సింహారెడ్డి

## విద్యార్థుల జీవితాలతో మోడీ చెలగాటం

### -పంచాయతీరాజ్ సంఘటన్ జిల్లా అధ్యక్షుడు కడపల్ల నర్సింహారెడ్డి

**ములుగు, జులై 22 (ప్రభాతవార్త):** పేపర్ లీకులతో కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్రమోడి విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని సిద్దిపేట జిల్లా పంచాయతీరాజ్ సంఘటన్ అధ్యక్షుడు కడపల్ల నర్సింహారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద పోలీసుల దుశ్చర్యను ఖండిస్తూ బుధవారం ములుగులో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో జెడ్‌పి కో-ఆప్షన్ మాజీసభ్యుడు సలీంతో కలిసి నర్సింహారెడ్డి మాట్లాడారు. లోక్‌సభ నేత, కాంగ్రెస్ దిగ్గజం రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీపై, మహిళ విద్యార్థుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు ప్రజాస్వామ్యాన్ని, విద్యార్థుల హక్కులను కూనీ చేయడమేనని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య దేశంలో శాంతియుతంగా నిరసనను తెలిపే హక్కు దేశపౌరులుగా ప్రతి ఒక్కరికి ఉందన్నారు. మహిళా విద్యార్థినిల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు బాధాకరమని, పోలీసుల దుశ్చర్య బిజెపి ప్రభుత్వం తీరుకు నిదర్శనమన్నారు. దేశంలో ఎన్నో అవినీతి ఆరోపణలు వెల్లువెత్తిన, వాటిపై సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం ఇలా అరెస్టులు చేస్తూ పోలీసుల చేత విద్యార్థులను, ప్రశ్నించే గొంతులపై దాడులకు దిగడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా బిజెపి ప్రభుత్వం మొండి వైఖరిని వీడి నీట్ పేపర్ లీక్‌కు బాధ్యతగా విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, విద్యార్థులపై జరిగిన దాడికి బాధ్యతగా ప్రధాని నరేంద్రమోడి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు రంగ సత్యనారాయణగౌడ్, శ్రీనివాస్, పల్లె కుమార్, నర్సాపూర్ మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఢీకొన్న లారీ

### పోలీసులకు ఫిర్యాదు చేసిన మున్సిపల్ చైర్మన్

**గజ్వేల్ టౌన్, జులై 22 (ప్రభాతవార్త):** పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి ఓవర్ లోడుతో వెళ్తున్న ఒక లారీ ఢీకొనడంతో విగ్రహం చేయి విరిగిన సంఘటన చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందన రవీందర్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. తెలంగాణ ప్రజల మనోభావాలకు, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన తెలంగాణ తల్లి విగ్రహానికి నష్టం కలిగించడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనకు కారణమైన బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కళ్యాణ్‌కార్ పద్మాబాయి నర్సింగరావు, బిఆర్ఎస్ కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**సిద్దిపేట అర్బన్, జులై 22,ప్రభాతవార్త :** సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని చింతమడక గ్రామానికి చెందిన పెద్దల్లిగారి వెంకటేష్ భార్య యాదమ్మ అనారోగ్యంతో మరణించడంతో వెంకటేష్ చిన్ననాటి మిత్రులు కలిసి బాధిత కుటుంబానికి బుధవారం రూ.8 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో రామదేని శ్రీనివాస్,ఆకుల మహేష్‌గౌడ్, పోచంపల్లి రవి, వాతం దానుంజయ, జింక యాదగిరి, మంగళి వెంకటేశం పాల్గొన్నారు.

## రిమ్మనగూడలో గ్రామసభ

**గజ్వేల్ టౌన్, జులై 22 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని రిమ్మనగూడ గ్రామంలో సర్పంచ్ మల్కగల్ల కరుణాకర్, గజ్వేల్ ఎంపిడిఓ ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రామసభను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్నినో ప్రభావం గురించి, వర్షాకాలంలో పాటించాల్సిన పారిశుద్ధ్య కార్యక్రమాలపై గ్రామ రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ రాచకొండ నర్సింలు, పంచాయతీ కార్యదర్శి భాను, వార్డు సభ్యులు, జెడ్‌పిహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు నాగభూషణం, జీపివో వేణు, ఏఈవో సచిన్, ఎస్‌హెచ్‌జి సిసి నాగరాజు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, విఓఏలు తదితరులు పాల్గొన్నారు.

**కుకునూరుపల్లిలో...**

**కొండపాక, జులై 22, ప్రభాతవార్త :** తక్కువ నీటితో ఎక్కువ దిగుబడినిచ్చే పంటలనే సాగు చేసుకోవాలని సర్పంచ్ మల్లం కనకవ్వ ఐలయ్య రైతులకు సూచించారు. బుధవారం కుకునూరుపల్లి గ్రామ పంచాయతి కార్యాలయంలో సర్పంచ్ అధ్యక్షతన ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని పంటలు సాగుచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఓ మహబుబ్ అలీ, ఎంపిఒ నాగభూషణం, ఎఒ గోవింధరాజులు, ఎఈఒ, కార్యదర్శి స్వప్న, హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఎఎన్ఎం పద్మ, అధికారులు పాల్గొన్నారు.

## యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణ పనులు ప్రారంభించాలి

### యంగ్ ఇండియా స్కూల్ సాధన సమితి డిమాండ్



మాట్లాడుతున్న అఖిల పక్షం నాయకుల

**కొండపాక, జులై 22, ప్రభాతవార్త :** యంగ్ ఇండియా ఇంటిగ్రెటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను కొండపాకలో వెంటనే చెపట్టాలని యంగ్ ఇండియా స్కూల్ సాధన సమితి అధ్వర్యంలో అఖిలపక్షం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం దుద్దెడ వైష్ణవి గార్డెన్‌లో రౌండ్ టెబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలానికి చెందిన అఖిలపక్ష నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, మేధావులు, యువజన సంఘాల నాయకులు తదితరులు మాట్లాడుతూ యంగ్ ఇండియా స్కూల్ నిర్మానానికి శంకుస్థాపన చేసిన చోటే నిర్మించలన్నారు. కొండపాకమండలానికి మంజూరైన స్కూల్‌ను ఇతర మండలాలను తరలించలనే అలోచనను విరమించుకోవాలని వారు డిమాండ్ చేశారు. యంగ్ ఇండియా స్కూల్‌ను ఎట్టి పరిస్థితుల్లో ఇతర ప్రాంతాలకు తరలించకుండా ఐక్యంగా ఉద్యమించి కాపాడుకుంటమన్నారు. స్కూల్ సాధన కోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి మండలంలోని అన్ని గ్రామాల సర్పంచుల ద్వారా తీర్మానాలు చేసి కలెక్టర్‌కు వినతి పత్రాలు అందించాలని తీర్మానించారు.

మండలం నుండి పాఠశాలను ఇతర ప్రాంతాలకు తరలించ డానికి ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకొమని తెల్చి చెప్పారు. ప్రభుత్వంనస్పందిచ కుంటే వివిధ రూపాల్లో అందోళన కార్యక్రమాలు చెపడతామని హెచ్చరిం చారు. పిల్లల భవిష్యత్‌కు నాణ్యమైన విద్యకు మేధావులు, విద్యావేత్తలు, ప్రజాస్వామ్య వాదులు ఉద్యమానికి మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమం లో అఖిల పక్షం నాయకులు ర్యాగల్ల దుర్గయ్య, భానుచందర్, సర్పంచులు కొయ్యడ వెంకటేశం, కొలుపుల గంగధర్, మంచాల చిన్న శ్రీనివాస్, అమ్ముల బాల్ నర్సయ్య, కనకచారి, కొమురయ్య, నూనె కుమార్, అనంతుల నరేందర్, వాసరి లింగరావు, బూర్గుల సురేందర్, ముస్త్యాల కనకయ, శశిధర్‌రెడ్డి, యాదగిరి, పికెరెడ్డి, ఎకెరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులు చేసే సేవలు వెలకట్టలేనివి

### చందంపేట సర్పంచి నాయిని ప్రవీణ్

**చిన్నశంకరంపేట, జులై 22, ప్రభాతవార్త:** గ్రామాలలో పారిశుద్ధ్య కార్మికులు చేసేసేవలు వెలకట్టలేనివని చందంపేట సర్పంచి నాయిని ప్రవీణ్ అన్నారు. వర్షాకాలంలో పారిశుద్ధ్య కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు బుధవారం రెయిన్‌కోట్లు అందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంతోష్‌కుమార్, పెంట స్వామి పాల్గొన్నారు.

# పారిశుద్ధ్యం లోపించిన మంచినీళ్లబండ గ్రామం..

-ఎటు చూసినా మురుగునీటి గుంతలే
-అధికారుల నిర్లక్ష్యంపై వస్తున్న విమర్శలు

**అక్కన్నపేట, జులై 22, ప్రభాతవార్త:**
అక్కన్నపేట మండలంలోని మంచినీళ్లబండ గ్రామంలో పారిశుధ్య పరిస్థితులు అధ్వాన్నంగా మారాయి. గ్రామంలో అడుగుపెట్టగానే మురుగు నీటి గుంతలు, దుర్వాసన, పాకుడుతో నిండిన నీరు దర్శనమిస్తుండటంతో గ్రామస్థులు తీవ్ర ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. గ్రామంలోని అంగన్‌వ్వాడీ కేంద్రం ముందు పెద్దగొయ్యితో మురుగు నీరు నిల్వ ఉండటంతో దోమలు అధికంగా వ్యాప్తి చెందుతున్నాయని స్థానికులు తెలిపారు. అలాగే గ్రామంలోని సిసి రోడ్లపై కూడా మురుగునీరు నిల్వ ఉండి పాకుడుపట్టడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలోని పలుచోట్ల నిల్వ నీటితో ప్లాస్టిక్ కవర్లు, చెత్త పేరుకుపోవడంతో ఈగలు, దోమలు విపరీతంగా పెరిగి దుర్వాసన వెదజల్లుతున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో డెంగీ, మలేరియా, వైరల్ జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి వీధిలోనూ ఇదే పరిస్థితి నెలకొన్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ, శానిటేషన్ కార్యక్రమాలు సక్రమంగా చేపట్టడం లేదని, సర్పంచ్, కార్యదర్శి వెంటనే స్పందించి


అంగన్వాడీ కేంద్రం వద్ద ఏర్పడిన గొయ్యి

సమస్యను పరిష్కరించాలని మంచినీళ్లబండ ప్రజలు కోరుతున్నారు.
ఈ విషయంపై ఎంపివో శివనగేష్‌ను వివరణ కోరగా, గ్రామంలో పారిశుధ్య సమస్యలు ఉన్నట్లు ఇప్పటివరకు తన దృష్టికి ఎలాంటి ఫిర్యాదు కాని, సమాచారం కాని రాలేదని తెలిపారు. ఒకవేళ సమస్య ఉన్నట్లు ఆధికారికంగా సమాచారం అందితే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, తక్షణ చర్యలు చేపట్టి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన వెల్లడించారు.

## ఆరునెలలైనా అందని సిలిండర్‌లు

-అధికారుల నిర్లక్ష్యంపై లబ్ధిదారుల అసంతృప్తి



భారత్ గ్యాస్ కార్యాలయం దృశ్యం

**చౌటకూరు, జులై 22, ప్రభాతవార్త:**
కేంద్ర ప్రభుత్వం పేద మహిళల కొరకు ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి ఉజ్జ్వల యోజన పథకం అమలులో తీవ్రజాప్యం జరుగుతోంది. ఉమ్మడి పుల్‌కల్ మండలంలో ఉజ్జ్వల గ్యాస్‌కనెక్షన్‌లు మంజూరై ఆరునెలలు గడుస్తున్నా, లబ్ధిదారులకు ఇప్పటివరకు పూర్తిస్థాయిలో సిలెండర్లు అందకపోవడం పట్ల లబ్ధిదారుల నుంచి అధికారులు విమర్శలను ఎదుర్కొంటున్నారు. ఆరునెలల క్రితం ఉజ్జ్వల పథకం కింద పేదకుటుంబాలకు గ్యాస్‌కనెక్షన్ మంజూరు అయినా అధికారులు మాత్రం లబ్ధిదారులకు గ్యాస్‌స్టౌ, రెగ్యులేటర్, పైప్, పాస్‌బుక్, బాండ్ మాత్రమే పంపిణీచేసి సిలెండర్‌ను పంపిణీచేయడం మరిచిపోయారు. లబ్ధిదారులు భారత్‌గ్యాస్ కార్యాలయం చుట్టూ చెప్పులరిగేలా ప్రదక్షిణలు చేస్తున్నా, ఇంకా టైం పడుతుందన్న సమాధానాలే చెబుతున్నారని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి పెండింగ్‌లో ఉన్న ఉజ్జ్వల గ్యాస్‌సిలెండర్‌లను లబ్ధిదారులకు పంపిణీ అయ్యేలా తగినచర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## చౌటకూరులో రెసిడెన్షియల్ న్యాయ కళాశాల

-మంత్రి దామోదర్ రాజనర్సింహకు గిరిజనుల కృతజ్ఞతలు


విలేకరులతో మాట్లాడుతున్న గిరిజనసంక్షేమ సంఘం బాధ్యులు

**చౌటకూరు, జులై 22, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన చౌటకూరులో రెసిడెన్షియల్ న్యాయ కళాశాలకు 35.50కోట్ల రూపాయలకు మంజూరు లభించడం పట్ల గిరిజన సంక్షేమ సంఘం బాధ్యులు సంతోషం వ్యక్తంచేస్తూ రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర్ రాజనర్సింహకు కృతజ్ఞతలు తెలిపారు. మండల కేంద్రమైన చౌటకూరులోని రైతువేదికలో బుధవారం గిరిజనసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నాయకులు సమావేశం అయ్యారు. ఈసందర్భంగా గిరిజనసంక్షేమ సంఘం ఉమ్మడిమెదక్‌జిల్లా అధ్యక్షులు, మండలపరిధిలోని బొమ్మారెడ్డిగూడెం సర్పంచ్ జైపాల్‌నాయక్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలకతీతంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ గిరిజనులసంక్షేమం, విద్యాభివృద్ధికి చొరవ తీసుకుంటున్నారని ఆనందం వ్యక్తంచేశారు. న్యాయ కళాశాల మంజూరుతో గిరిజనులు న్యాయాధికారులుగా ఎదిగే అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో గిరిజనసంఘం నాయకులు గణపతినాయక్, మొగావత్ సురేష్, అభిలాష్, బద్రీనాథ్ పాల్గొన్నారు.

## రాహుల్‌గాంధీ అరెస్ట్‌పై టేక్మాల్‌లో నిరసన..

-భారీగా తరలివచ్చిన కార్యకర్తలు

**టేక్మాల్, జులై 22, ప్రభాతవార్త:**
పార్టీపిలుపుతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మండల కేంద్రమైన టేక్మాల్ చౌరస్తాకు భారీగా తరలివచ్చారు. బుధవారం టేక్మాల్ చౌరస్తాలో కార్యకర్తలంతా ఒకేసారి బొడ్మట్‌పల్లి మెదక్ రోడ్డుపై రాస్తారోకోకు దిగారు. కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టును టేక్మాల్ మండల కాంగ్రెస్‌పార్టీ శ్రేణులు తీవ్రంగా ఖండిస్తున్నాయని మండల నాయకులు అన్నారు. ఈసందర్భంగా ఇటీవల దేశవ్యాప్తంగా వెలుగుచూస్తున్న పరీక్షల పేపర్ లీకులు, లక్షలాదిమంది విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన వ్యక్తంచేసిన విద్యార్థులకు సంఘీభావం తెలుపుతూ ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్న రాహుల్‌గాంధీని పోలీసులు అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమైనచర్య అని, ప్రజాస్వామ్య దేశంలో తమహక్కుల కోసం శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ప్రతిపౌరుడికీ రాజ్యాంగం కల్పించిందని పేర్కొన్నారు. విద్యార్థుల న్యాయమైన ఆందోళనలను వినాల్సిన ప్రభుత్వం, వారిసమస్యలకు పరిష్కారం చూపాల్సిన బాధ్యతను విస్మరించి బలప్రయోగానికి దిగడం అత్యంత దురదృష్టకరం. విద్యార్థులపై బాష్పవాయుగోళాలు ప్రయోగించడం, వారిని అణచివేయడానికి ప్రయత్నించడం ఖండించదగిన విషయమన్నారు. నీట్‌సహా వివిధపరీక్షల్లో చోటుచేసుకున్న పేపర్‌లీకులు, అవకతవకలపై పూర్తిస్థాయిలో పారదర్శక విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

## శ్రీవారాహిదేవి నవరాత్రి మహోత్సవాలు

-15 నుంచి 23 వరకు అమ్మవారికి రోజుకో అలంకరణ
-9 రోజులు ఆశ్రమంలో చండీహోమాలు


ముంగి ఆదిలక్ష్మి ఆశ్రమంలో హోమాలు నిర్వహిస్తున్న దృశ్యం

**న్యాల్‌కల్, జులై 22, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని ముంగి గ్రామ శివారులోని గంగ్వార్-అల్లాదుర్గం రోడ్డు పక్కనగల ఆదిలక్ష్మి ఆశ్రమంలో ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని ఈ నెల 15వ తారీఖు నుంచి శ్రీవారాహిదేవి నవరాత్రిమహోత్సవాలు నేత్రపర్వంగా కొనసాగుతున్నాయి. ఈనెల 23వ తేదీ వరకు ఆశ్రమంలో చండీహోమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. శ్రీవారాహిదేవి నవరాత్రిమహోత్సవాలను పురస్కరించుకుని నిత్యం ఆశ్రమంలో అమ్మవారిని 15న దేవిశైలపుత్రిగా, 16న బ్రహ్మచారిణిగా, 17న చంద్రగంటదేవిగా, 18న కుష్మాండదేవిగా, 19న స్కందమాతదేవిగా, 20న కాత్యాయనీదేవిగా, 21న కాళరాత్రిదేవిగా, 22న మహాగౌరీదేవిగా అలంకరించి అభిషేకం, కుంకుమార్చన పూజా కార్యక్రమాలు, అమ్మవార్ల కథాకాలక్షేపం, మహాహారతి, ఆశ్రమానికి చేరుకున్న భక్తులకు తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 23న సిద్ధిధాత్రిదేవిగా అభిషేకంచేసి అలంకరణ, కమలార్చన, చండీహోమం, సిద్ధిధాత్రిదేవి కథ మహాపూర్ణాహుతి, ఆశ్రమానికి చేరుకున్న భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆశ్రమపీఠాధిపతి దేవిగిరి మహారాజ్ పేర్కొన్నారు.

## శ్రీరామలింగేశ్వర ఆలయంలో సప్తాహభజనలు

**న్యాల్‌కల్, జులై 22, ప్రభాతవార్త:**
గ్రామసుభిక్షాన్ని కాంకిస్తూ మండలకేంద్రమైన న్యాల్‌కల్‌లోని శ్రీరామలింగేశ్వర ఆలయంలో ప్రతి సంవత్సరం ఆషాఢమాసంలో సప్తాహభజన కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులోభాగంగా బుధవారం గ్రామస్థులు ఉదయం ఆలయంలో ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించి సప్తాహభజనలు ప్రారంభించారు. గ్రామస్థులు ఉల్లాసంగా భజనలు చేస్తుండటంతో ఆలయప్రాంతం శివనామస్మరణతో మారుమ్రోగుతోంది. భజనల ముగింపురోజైన ఏడవరోజున గ్రామంలోని పురవీధులగుండా ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో స్వామివారిని ప్రతిష్ఠించుకుని పల్లకీసేవ కార్యక్రమాలు నిర్వహించి ఆలయానికి చేరుకున్న భక్తులకు తీర్థప్రసాదాల వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తామని ఉత్సవకమిటీ బాధ్యులు పేర్కొన్నారు.

## కంగ్టిని సందర్శించిన డిఎల్‌పిఓ

-హోటల్ యాజమానికి 5వందల జరిమాన


వ్యాపారులకు సూచనలు చేస్తున్న డిఎల్‌పిలో సుధాకర్‌రెడ్డి

**కంగ్టి, జులై 22, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన కంగ్టిని బుధవారం డిఎల్‌పిఓ పట్లోళ్ల సుధాకర్‌రెడ్డి సందర్శించారు. గ్రామంలోని హోటళ్లు, కిరాణా దుకాణాలు, కూరగాయలు, పండ్లదుకాణాలను, బేకరీ షాపులను సందర్శించి వ్యాపారులకు డిఎల్‌పిలో పలు సూచనలు చేశారు. ప్రతి వ్యాపారి తమ వ్యాపార సముదాయం వద్ద చెత్తబుట్టలను ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. వ్యాపార సముదాయాల వద్ద పరిశుభ్రత పాటించాలని ఆదేశించారు. గ్రామంలోని బందయ్యస్వామి హోటల్ ముందర చెత్త కనిపించడంతో హోటల్ నిర్వాహకులకు డిఎల్‌పిలో 5వందల రూపాయల జరిమాన విధించారు. డిఎల్‌పిఓవెంట ఎంపిఓ లక్ష్మయ్య, పంచాయతీ కార్యదర్శి ర్యాకంచెర్ల పవన్‌కుమార్, సర్పంచ్ కృష్ణ ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

## భూభారతి రీసర్వేకు సహకరించాలి

-రుక్మాపూర్ గ్రామ సభలో ఆర్‌డిఓ దేవుజా



భూభారతి రీసర్వే గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్‌డిఓ దేవుజా

**న్యాల్‌కల్, జులై 22, ప్రభాతవార్త:**
భూభారతి రీసర్వేకు ప్రతి రైతు తన వంతు సహకారం అందించాలని ఆర్‌డిఓ దేవుజా సూచించారు. బుధవారం మండలపరిధిలోని రుక్మాపూర్‌లో భూభారతి రీసర్వేపై గ్రామసభను నిర్వహించారు. గ్రామసభకు ముఖ్య అతిథిగా హాజరైన ఆర్‌డిఓ దేవుజా గ్రామస్థులను ఉద్దేశించి ప్రసంగించారు. భూభారతి రీసర్వే విజయవంతం అయ్యేలా ప్రతి ఒక్కరు అధికారులకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రభులు, రెవిన్యూ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియా పట్ల అప్రమత్తంగా ఉండాలి

-జోగిపేట మున్సిఫ్‌కోర్టు మెజిస్ట్రేట్ అసదుల్లా షరీఫ్


సదస్సులో మాట్లాడుతున్న మున్సిఫ్‌కోర్టు మెజిస్ట్రేట్ అసదుల్లా షరీఫ్

**జోగిపేట, జులై 22, ప్రభాతవార్త:**
విద్యార్థులు సోషల్‌మీడియా పట్ల అప్రమత్తంగా ఉండాలని, కేవలం జ్ఞాన సముపార్జనకుమాత్రమే సోషల్‌మీడియాను వినియోగించుకోవాలని జోగిపేట మున్సిఫ్‌కోర్టు మెజిస్ట్రేట్ అసదుల్లా షరీఫ్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని నేరెడిగుంటజిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో నిర్వహించిన న్యాయ విజ్ఞానసదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ప్రస్తుతసమాజంలో సోషల్‌మీడియా కీలకపాత్ర పోషిస్తుందని, అయితే దీనికి బానిసకావొద్దని, విజ్ఞానం పెంచుకోవడానికే ఉపయోగించాలని హితవుపలికారు. ఈ డిజిటల్ యుగంలో సాంకేతికపరిజ్ఞానం కూడా అవసరమని, సైబర్‌నేరాలు బాగా పెరిగిపోతున్నందున వాటిబారిన పడకుండా జాగ్రతగా ఉండాలని పేర్కొన్నారు. ముఖ్యంగా సోషల్‌మీడియా వల్ల కలిగే సానుకూల, ప్రతికూల అంశాలను ఆయన విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. ఈసదస్సులో జోగిపేట మార్కెట్ కమిటీ ఛైర్మన్, న్యాయవాది మక్త జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పలు అంశాలకు సంబంధించిన చట్టాలను వివరించారు. ఈసదస్సులో గ్రామసర్పంచ్ ఒగ్గు సాయికిరన్, ఎస్‌ఐ గిరి శ్రీకాంత్, న్యాయవాదులు నారాయణరెడ్డి, విఠల్‌రెడ్డి, ఎం.ఎ.కరీం, వెంకట్ రాంరెడ్డి, శివప్రసాద్, నర్సింలు, మాజీసర్పంచ్ మల్లప్ప, మాజీ ఎంపిటిసిలు శివరాజ్, క్రిష్ణారెడ్డి, రాజిరెడ్డి, యూత్ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు ప్రతిభారాణి, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నిసంఘం ఛైర్మెన్‌గా మరోసారి రొడ్డె కిష్టయ్య

**జోగిపేట, జులై 22, ప్రభాతవార్త:**
జోగిపేట ఉన్ని పారిశ్రామిక సంఘం నూతన ఛైర్మెన్‌గా మరోసారి డాకూరు గ్రామానికిచెందిన రొడ్డె కిష్టయ్య ఎన్నికైనారు. బుధవారం ఉన్నిసంఘం భవనంలో నిర్వహించిన ఛైర్మెన్ ఎన్నికల్లో ఛైర్మెన్‌పదవికి ఒకే నామినేషన్ రావటంతో మరోసారి రొడ్డె కిష్టయ్య ఛైర్మెన్‌గా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి నిర్మలారాజకుమారి ప్రకటించారు. దీంతోపాటు వైస్‌ఛైర్మెన్, కార్యదర్శి, కోశాధికారి పదవులకు ఒక్కో నామినేషన్లు మాత్రమే రావటంతో నామినేషన్ వేసినవారిని పదవులకు ఎంపికైనట్లు ప్రకటించారు. ఇందులో వైస్‌ఛైర్మెన్‌గా సంగమేశ్వర్, కార్యదర్శిగా జుట్టు నర్సింలు, కోశాధికారి గొల్ల నారాయణలు ఎన్నికవగా మిగతా ఐదుమంది డైరెక్టర్లుగా ఎన్నికయ్యారు. వీరందరితో పదవీప్రమాణస్వీకారం చేయించారు. ఈసందర్భంగా నూతనఛైర్మెన్‌గా ఎన్నికైన రొడ్డె కిష్టయ్య మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి తనవంతు కృషిచేస్తానని అన్నారు. మరోసారి తనకు ఛైర్మెన్‌గా అవకాశం కల్పించిన సంఘసభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## అక్టోబరు చివరివరకే సింగూరు తాగునీరు

-ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ నాగసాయి


సర్పంచ్‌లకు, కార్యదర్శులకు సూచనలు చేస్తున్న ఈఈ నాగసాయి

**పుల్‌కల్, జులై 22, ప్రభాతవార్త:**
అక్టోబరుచివరివరకే మండలపరిధిలోని సింగూరుప్రాజెక్టునుంచి 45 గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతుందని ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ నాగసాయి తెలిపారు. తాగునీరు అందుకుంటున్న 45 గ్రామాల ప్రజలు ప్రత్నామ్నాయ చర్యలుతీసుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రతిగ్రామంలో ఉన్న బోరుబావులను వెంటనే మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీ అధికారులు చర్యలుతీసుకోవాన్నారు. మరమ్మతుకు అవకాశం లేని బోర్లస్థానంలో అవసరమైతే కొత్త బోర్లు తవ్వించి తాగునీటి కొరత తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు నిరంతరం తాగునీరు సరఫరా అయ్యేలా చూసుకోవాలని సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు ఈఈ నాగసాయి సూచించారు.

## 90శాతం సబ్సిడీతో జిప్సం బస్తాల పంపిణీ

-మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్‌కుమార్

**రామాయంపేట, జులై 22, ప్రభాతవార్త:**
రామాయంపేట మండలంలో 90శాతం సబ్సిడీపై ప్రభుత్వం అందించిన జిప్సం బస్తాలను మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్‌కుమార్ బుధవారం రైతులకు పంపిణీచేశారు. ఒక టన్ను జిప్సం పూర్తి ధర రూ. 5,340 కాగా, 90శాతం సబ్సిడీతో రైతులకు కేవలం రూ.534కే అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిప్సం సహజసిద్ధంగా లభించే క్యాల్షియం సల్ఫేట్ ఖనిజమని, ఇందులో సుమారు 21 శాతం క్యాల్షియం, 18 శాతం సల్ఫర్ (గంధకం) ఉండి పంటల ఎదుగుదలకు ఎంతో ఉపయోగమని వివరించారు. జిప్సం వాడటం వల్ల వేర్లవ్యవస్థ బలపడటంతో మొక్కలు నీరు, పోషకాలను సమర్థవంతంగా గ్రహిస్తాయని, నేల భౌతికలక్షణాలుమెరుగై గాలిప్రసరణ, నీటి ఇంకుదల పెరుగుతాయని పేర్కొన్నారు. నేల రకాన్ని బట్టి జిప్సం వినియోగిస్తే వరిసాగులో మంచి ఫలితాలు సాధించవచ్చని రైతులకు మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్ సూచించారు.
ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రవీణ్, సాయికృష్ణతో పాటు పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఫ్లాగ్‌షిప్ ప్రజలకుచేరేలా చర్యలుతీసుకోవాలి

-మండల ప్రత్యేక అధికారిణి వసంతకుమారి


అవగాహన కల్పిస్తున్న మండల ప్రత్యేక అధికారిణి వసంతకుమారి

**చౌటకూరు, జులై 22, ప్రభాతవార్త:**
ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్లాగ్‌షిప్ పథకాలు గ్రామస్థాయిలో ప్రజలకు సమర్థవంతంగా చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని మండల ప్రత్యేక అధికారిణి వసంతకుమారి సూచించారు. బుధవారం మండలకేంద్రమైన చౌటకూరులోని రైతువేదికలో జిల్లా కలెక్టర్ ఆదేశాలమేరకు ప్రభుత్వం అమలుచేస్తున్న ఫ్లాగ్‌షిప్ అభివృద్ధిపథకాల అమలుతీరు, పనితీరు, పురోగతిపై మండలస్థాయి అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయాశాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ పథకం సిబ్బంది తమశాఖల పరిధిలో చేపడుతున్న అభివృద్ధికార్యక్రమాలు, లక్ష్యాలు, సాధించిన పురోగతి, ఎదురవుతున్న సమస్యలు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలను సమావేశంలో వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ శంకర్, ఎంపిఓ సువర్ణ, డిప్యూటీ తహసీల్దార్ అనుదీప్, ఆయాశాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## బాధితులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

**నారాయణఖేడ్, జులై 22, ప్రభాతవార్త:**
నారాయణఖేడ్ పట్టణానికి చెందిన మారుతి, కాశీనాథ్‌ల తల్లి అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఖేడ్ మాజీఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి ఆసుపత్రికివెళ్లి ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అబ్బెంద గ్రామానికి చెందిన ఇటిక్యాల శంకరప్ప కూడా అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్సపొందుతున్న విషయం తెలుసుకుని ఆయనను పరామర్శించారు. ఈసందర్భంగా వైద్యులతోమాట్లాడిన ఎమ్మెల్యే, బాధితులకు అత్యుత్తమ వైద్యసేవలు అందించి ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని కోరారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో నందు, భీమావు, విజయ్‌కుమార్‌తో పాటు కుటుంబసభ్యులు, పార్టీనాయకులు, కార్యకర్తలు, పలువురు పాల్గొన్నారు.

## ఇప్పేపల్లిలో 85శాతం పూర్తైన ఎస్‌ఐఆర్

-ఇంటింటికీ తిరిగి ఓటరు వివరాల సేకరణ


పత్రాలను స్వీకరిస్తున్న దృశ్యం

**మొగుడంపల్లి, జులై 22, ప్రభాతవార్త:**
ఇప్పేపల్లి గ్రామంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్‌ఐఆర్) ప్రక్రియ జోరుగా కొనసాగుతోంది. గ్రామసర్పంచ్ కవిత నాగిశెట్టి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ఇప్పటికే 85 శాతం పూర్తయింది. బిఎల్వో సుగుణమ్మ, జిపివో సుభాష్, వార్డుసభ్యులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరిస్తూ, అవసరమైన దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదు అయ్యేలా ప్రత్యేక శ్రద్ధతో పని చేస్తున్నట్లు తెలిపారు. మిగిలిన ప్రక్రియను కూడా త్వరితగతిన పూర్తి చేసి, అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో చేర్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ కవిత నాగిశెట్టి తెలిపారు. గ్రామప్రజలు కూడా అధికారులు, సిబ్బందికి సహకరించి ఎస్‌ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలని ఆమె కోరారు.

## విద్యార్థుల్లో పర్యావరణ చైతన్యం అత్యవసరం..

-రామాయంపేట మున్సిపల్ కమిషనర్ రవీందర్


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమీషనర్ రవీందర్

**రామాయంపేట, జులై 22, ప్రభాతవార్త:**
పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత, నీటిసంరక్షణపై విద్యార్థుల్లో బాధ్యతాయుతమైన చైతన్యం ప్రస్తుతపరిస్థితులలో అత్యవసరమని రామాయంపేట మున్సిపల్ కమిషనర్ రవీందర్ సూచించారు. విద్యార్థులకు అవగాహన పెంపొందించే లక్ష్యంతో బుధవారం స్థానిక మంజీరావిద్యాలయంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, జల్‌శక్తి అభియాన్ క్యాచ్ ది రైన్ - జన్ భాగీదారీ 2026 కార్యక్రమాలు నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమంలో రవీందర్ విద్యార్థులకు పలుసూచనలు చేశారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి పౌరుడి బాధ్యత అని సూచించారు. అదేవిధంగా జల్‌శక్తి అభియాన్ కార్యక్రమంలో భాగంగా వర్షపునీటిని ఒడిసిపట్టడం, నీటిని వృథాచేయకుండా పొదుపుగా వినియోగించడం, భవిష్యత్ తరాలకు నీటివనరులను కాపాడాల్సిన అవసరంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల యాజమాన్యం, విద్యార్థులతో కలిసి నీటిపొదుపు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ వనిత, మంజీరావిద్యాలయం కరస్పాండెంట్ జితేందర్‌రెడ్డితో పాటు మున్సిపల్ సిబ్బంది రంజిత్, కృష్ణ, ప్రవీణ్ పాల్గొన్నారు.

## మంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం

-రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు

**టేక్మాల్, జులై 22, ప్రభాతవార్త:**
టేక్మాల్ మండలంలోని గ్రామీణప్రాంతాల రోడ్ల అభివృద్ధికి సుమారు రూ. 100కోట్ల భారీనిధులను కేటాయించిన రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు స్థానికప్రజలు, నాయకులు ఘనంగా కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి ప్రత్యేకచొరవతో మండలంలో రవాణా సౌకర్యాలు మెరుగుపడనున్న నేపథ్యంలో, నేడు టేక్మాల్ మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పాలతో అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖులు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు టేక్మాల్ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ తిమ్మిగారి సుధాకర్, భూమిరెడ్డి, తలారి అవినాష్, నవీన్, వినీత్ దేవప్రసాద్, సిద్దు, మెదక్‌జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌రెడ్డి, ఆర్టిఏ మెదక్ మల్లారెడ్డి, నాయకులు, షేక్ మజహర్, శ్రీధర్‌చారి, సత్యం, యూసుఫ్ మాజీసర్పంచ్‌లు బిక్షపతి, ఆకులపల్లి పాపయ్య, రవిగౌడ్, ఎస్టీసెల్ అధ్యక్షులు సేవాలా, సాయిశేషు, అవినాష్, ప్రవీణ్, రాజు, కాజా, రవిరెడ్డి, మానయ్య తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి

-పుల్‌కల్‌లో విద్యాసంస్థల బాయ్‌కాట్
-నిరసన వ్యక్తంచేసిన ఎన్‌ఎస్‌యుఐ నాయకులు


బస్వాపూర్ చౌరస్తాలో నిరసన వ్యక్తంచేస్తున్న ఎన్‌ఎస్‌యుఐ నాయకుల దృశ్యం

**పుల్‌కల్, జులై 22, ప్రభాతవార్త:**
న్యూఢిల్లీలో విద్యార్థులపై లాఠీచార్జి, రాహుల్ గాంధీ అరెస్టులనునిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు బుధవారం మండలకేంద్రమైన పుల్‌కల్‌లో విద్యాసంస్థలను బంద్‌చేయించి బస్వాపూర్ చౌరస్తాలో ఎన్‌ఎస్‌యుఐ నాయకులు విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఎన్‌ఎస్‌యుఐ జిల్లా ఉపాధ్యక్షులు నిరంజన్ మాట్లాడుతూ నీట్ పరీక్షపత్రాల లీకేజీ వ్యవహారంలో బాధ్యత వహిస్తూ కేంద్రవిద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అక్రమంగా విద్యార్థులపై లాఠీచార్జిచేసి విద్యార్థులకు సపోర్టుగా ఉంటూ సానుభూతి తెలిపేందుకు వచ్చిన ప్రతిపక్షనేత రాహుల్ గాంధీని అక్రమంగా అరెస్టుచేయడం తగదని హెచ్చరించారు. విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేయడమే కాక వారిని మానసికంగా ఇబ్బందిపెట్టి న్యాయంగా ధర్నాచేస్తున్న వారిపై లాఠీచార్జి చేయించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇందుకు బాధ్యత వహించాలని మండల యూత్‌కాంగ్రెస్ అధ్యక్షులు ఉదయ్ కుమార్ హితవు పలికారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బోయిని శ్రీనివాస్, మండల ప్రధానకార్యదర్శి ఏట్టి శ్రీనివాస్, ఆత్మకమిటీ డైరెక్టర్ మన్నె విఠల్, యేసు, నర్సింలు, వీరేశం, ఎన్‌ఎస్‌యుఐ నాయకులు ప్రేమ్‌కుమార్, ప్రవీణ్, వినయ్, మధు, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.